**పరమేశ్వరశాస్త్రిగారింట్లో దొంగలు పడ్డారట! పొద్దున్నే కాలేజీకి వెళ్ళేసరికి లెక్చరర్లు గుసగుసలుగా చెప్పుకుంటున్నారు.**

గా(డెజ్ బీరువా తాళాలు పక్కనే టేబిల్‌పై పడేసి వున్నాయట! బీరువాలో ఇరవై వేల నగదు, ముప్పై సవర్ల నగలు వున్నాయట! కానీ అవన్నీ నిక్షేపంగా వున్నాయి. టేబిల్‌పై వున్న కొత్త ఫ్యాన్ మాత్రం దొంగలెత్తుకుపోయారు.

# సర్దుబాటు



తిరుమూరు సుధాకర్ రెడ్డి

శాస్త్రిగారు ఫ్యామిలీతో సెకండ్ షో చూసి వచ్చేటప్పటికి ఈ ఘోరం జరిగిపోయింది. దుర్భేద్యమైన ఆ ఇంటి తాళాలను పగలగొట్టి ఇంట్లో దూరిన గజదొంగలు ఇంకేమీ అక్కర్లేదన్నట్లు టేబిల్ ఫ్యాన్ మాత్రమే తస్కరించుకుపోవడమేమిటి? తలాతోక రకంగా కామెంట్ చేస్తున్నారు కాలేజీ స్టాఫ్. శాస్త్రిగార్ని పరామర్శిద్దామని ఆయన డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళాను.

"రండి సార్! రండి. మీ కోసమే వెయిట్ చేస్తున్నాను" శాస్త్రిగారు సాదరంగా ఆహ్వానించారు.

"మీకు తెలుసుగదూ? రాత్రి మా ఇంట్లో దొంగలు పడ్డారు"–చావు కబురులా మెల్లగా చెప్పారాయన.

"అవును. విన్నాను. అయితే ఫ్యాన్ తప్ప ఇంకేమీ పోలేదంటారా? బాగా వెదికి చూశారా?" నా అనుమానాన్ని దాచుకోలేకపోయాను. పరమేశ్వరశాస్త్రి ఫిజిక్స్ లెక్చరర్. మెడికల్ ఎంట్రన్స్ కోచింగ్‌లో మంచి పేరున్నవాడు. రోజుకు పన్నెండు గంటలు ఏకధాటిగా పది బ్యాచ్‌ల స్టూడెంట్లకు ట్యూషన్లు చెప్పగల ఘనాపాఠి. ట్యూషన్లలో అతనెంత సంపాదిస్తున్నదీ అందరికీ తెలుసు. ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళకి కూడా తెలుసు! ఆదాయపన్నువాళ్ళకి అతనింట్లో ఏమీ దొరకడంలేదంటే అర్థం వుందిగాని దోపిడి దొంగలు కూడా ఉత్తచేతులతో వెళ్ళారంటే నమ్మడమెలా?

"అబ్బే! ఇంకేమీ పోలేదండీ, ఒక్క ఫ్యాన్ తప్ప! అందుకే నాకు భయంగా వుంది" అన్నారు శాస్త్రిగారు.

"భయమెందుకు?" నేను ఆశ్చర్యపోయాను.

"ఇదేదో 'డేంజర్ సిగ్నల్'గా లేదూ?" ఆయన నా కళ్ళలోకి చూస్తూ అన్నారు.

"అబ్బే! అలా ఎందుకనుకోవాలి? బీరువా తెరిచేలోగా పక్కింట్లో అలికిడి అయివుండొచ్చు. దాంతో దొంగలు ఫ్యాన్ పుచ్చుకుని ఉడాయించి వుంటారు."

నా ఊహ ఆయనకు బాగా నచ్చింది.

"నిజమే సుమండీ! మా బాగా చెప్పారు" మెచ్చుకోలుగా అన్నాడాయన.

"చూడబోతే వాడెవడో దోమల బాధితుడిలా వున్నాడు"–నా జోక్‌కు ఆయన హాయిగా నవ్వేశారు. ఆ వెంటనే కుర్చీలోంచి లేచి "పదండి పోలీస్ స్టేషన్‌కి వెళ్దాం" అన్నారు.

"నేనెందుకు?" తప్పించుకోబోయాను.

"ప్లీజ్! రండిసార్! ఇలాంటి విషయాలలో మీరు అనుభవజ్ఞులు. నాకేమీ తెలియదు" అని శాస్త్రిగారు ప్రాధేయపడ్డారు. పరమేశ్వరంగారికి ఫిజిక్స్ ప్రపంచం తప్ప వేరే ప్రపంచం లేదు. మైకేల్ ఫారడే గురించి మూడు గంటలు మాట్లాడగలడు కానీ మన ముఖ్యమంత్రి మూడో అల్లుడు ఎవడంటే మొహం వేలాడేస్తాడు! ఆయన అవస్థకు జాలిపడో లేక క్లాసు వుందని అబద్ధం చెప్పలేకో కాని ఆయన వెంట పోలీస్ స్టేషన్‌కి నడిచాను.

ఆ స్టేషన్లో నా క్లాస్‌మేట్ ఒకడు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శాస్త్రిగార్ని చూడగానే వాడు లాఠీ తిరగేశాడు. నన్ను పక్కకి పిల్చుకెళ్ళి "వీడో గజదొంగ సార్! కాలేజీ స్టూడెంట్లని దోచుకుతింటున్నాడు. ట్యూషన్ ఫీజు కట్టడం ఆలస్యం అయిందని నా కొడుకుని ట్యూషన్లోంచి తరిమేశాడు ... దొంగనా కొడుకు!" అంటూ తిట్లకు దిగాడు.

"ఒరేయ్! నీకు పుణ్యం వుంటుంది నోరు ముయ్యరా!" అంటూ కానిస్టేబుల్ని కంట్రోలు చేసి మేము వచ్చిన విషయం చెప్పి ఎలాగైనా మా శాస్త్రి కేసు రిజిస్టర్ చేసి నా ప్రిస్టేజీ నిలబెట్టమని కోరాను.

అయిష్టంగానే వాడు ఆ పని చేసిపెట్టాడు. కానీ సబ్ ఇన్‌స్పెక్టర్‌గారు మాత్రం ఫ్యాన్ దొరుకుతుందన్న హామీ ఇవ్వలేకపోయారు.

పైగా "మీ వీధిలో అన్ని ఇళ్ళు వెదికి చూడండి. ఎక్కడో ఓ చోట ఫ్యాను దొరక్కపోదు" అని శాస్త్రిగారికి ఓ ఉచిత సలహా పారేశారు. ఆ సలహా సంగతి ఎలా వున్నా చేతి చిలుం వదలకుండా కేసు రిజిస్టరు అయినందుకు శాస్త్రిగారు చాలా సంబరపడిపోయి నాకు థ్యాంక్స్ చెప్పారు.

* * *

ఆ రోజు ఉదయం మా ఎదురింట్లో ఏదో జరిగింది. అది మా కౌన్సిలర్ రామానుజం ఇల్లు!

ఆ యింటికి ఎవరెవరో వస్తూ పోతూ వున్నారు. రామానుజం పార్టీ మార్చాడా? పదవేదైనా సంపాదించాడా? లేక ఆ ఇంట్లో పెద్దవారెవరైనా కాలం చేశారా? ఏమిటీ పరామర్శలు 'అన్న సందేహం కలిగింది నాలో! ఇంతలో అట్టహాసంగా పోలీసు వ్యాన్ వచ్చి కౌన్సిలర్ ఇంటి ముందు ఆగింది. దాంతో అసలు విషయం అర్థమైంది. కౌన్సిలర్ ఇంట్లో కూడా దొంగలు పడ్డారన్న మాట! పోలీసు అధికారుల ఇళ్ళలో పడగాలేనిది కౌన్సిలర్ ఇంట్లో దొంగలు దూరడం నాకు వింతగా అనిపించలేదు!

ఎంతైనా ఆ కౌన్సిలర్ అధికార పార్టీ ప్రముఖుడు గనుక పోలీసులు ఇంత ఆర్భాటం చేస్తున్నారు–అనుకున్నాను.

అందరూ వెళ్ళిపోయాక నేనూ వెళ్ళాను పరామర్శకి! ఆయనింట్లో కూడా దొంగలు ఏమీ దోచుకోలేదట! ఒక్క టేబిల్ ఫ్యాన్ తప్ప!

నేను నివ్వెరపోయాను. మా పరమేశ్వరశాస్త్రి విషయం చెప్పాను. ఇలాంటి ఫ్యాన్ల దొంగతనాలు టౌన్లో ఏడెనిమిది జరిగాయన్నాడు కౌన్సిలర్. అందుకే పోలీసు శాఖను బండబూతులు తిట్టేశానని, ఎస్పయ్‌గారు గడగడా ఒణికిపోయారని రామానుజం గర్వంగా చెప్పాడు.

"ఇంతకీ ఆయనేమన్నాడు?" నేను అడిగాను.

"ఏమంటాడు? వారం రోజుల్లో సర్దుబాటు చేస్తానన్నాడు. లేకపోతే వీణ్ణి ఆదిలాబాద్ అడవులకు పంపెయ్యనూ?" రామానుజం తన రాజసం చూపించాడు.

ఆదిలాబాద్ అడవులు అంటే అర్థమైంది కాని సర్దుబాటు అంటే నాకు సరిగా తెలిసిరాలేదు. రామానుజంగార్ని అడగలేకపోయాను. 'ఇందులో గొడవేముంది సర్దుబాటు చెయ్యడానికి!' అనుకుంటూ మౌనంగా లేచి వచ్చేశాను.

* * *

పది రోజులు గడిచాయి.

శాస్త్రిగారు పదే పదే వెబుతున్నారు ఫ్యాన్ ఆచూకీ తెలియలేదని! మరోసారి స్టేషన్‌కి పోయి వద్దాంరండి అంటూ ఊరికే ఊదర బెడుతున్నాడు. అతన్ని తప్పించుకు తిరగవలసి వస్తోంది. చివరికోసారి "మా కౌన్సిలర్ ఫ్యాన్‌కు కూడా మీ ఫ్యాన్ గతే పట్టిం"దని చెప్పి చూశాను. దాంతో కొంత శాంతించాడు శాస్త్రి.

ఓ రోజున కౌన్సిలర్‌తో ఏదో పని వుండి ఆయనింటికి వెళ్ళాను. టేబిల్ ఫ్యాన్ ముందు కూచొని పేపరు చదువుతున్నారు రామానుజంగారు. ఫ్యాన్‌గాలికి ఆయన సిల్కు లుంగీ రెపరెప మంటున్నది.

"అరె! మీ ఫ్యాన్ దొరికిందే" అంటూ ఆ ఫ్యాన్ వైపు చూశాను. ఒక్క క్షణం నా గుండె చప్పుడు నాకు వినిపించలేదు. కళ్ళు చిట్లించి మరీ చూశాను. అది మా పరమేశ్వరశాస్త్రి ఫ్యాను! ఎన్నోసార్లు వాళ్ళ ఇంట్లో చూశాను! దొంగలెత్తుకుపోయింది దాన్నే! ... ఇదేనా 'సర్దుబాటు' అంటే? ఔరా! పోలీసుల మహిమ!